కూటమి కక్ష.. పేదలకు శిక్ష

- కలగా మిగులుతున్న సొంతిల్లు
- ఏడాది నుంచి నిలిచిన నిర్మాణాలు
- నేటికి అందుబాటులోకి రాని ఇసుక
- అయోమయంలో లబ్ధిదారులు


జగ్గడిగుంటపాలెంలోని జగనన్న కాలనీలోని ఇళ్లు

తెనాలి అర్బన్: కూటమి ప్రభుత్వ చర్యలతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. అర్హులైన పేదలందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. మొదటి విడత కింద ఎంపిక చేసిన వారికి అవసరమైన మెటీరియల్, నిధులను సమకూర్చింది. దీంతో పేదలు సంతోషంగా నిర్మాణాలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ ఆపేశారు. మెటీరియల్, నిధులు సమకూర్చకపోవడంతో ఏడాదిగా నిర్మాణాలు పూర్తిగా నిలచిపోయాయి. స్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి. కాలనీలలో ఇళ్ల మెరకకు ఇసుక పంపిణీని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. లబ్ధిదారులకు, కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపేసింది.

వైఎస్సార్ సీపీ ఆశయానికి గండి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదటి విడత కింద 9907 మందిని ఎంపిక చేసింది. ఇందులో బేస్ మట్టం వరకు నిర్మించిన వారు 2300 మంది, శ్లాబ్ లోపు వారు 162 మంది, పూర్తయిన ఇళ్లు 1151 ఉన్నాయి. వీటిని గత ప్రభుత్వమే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించింది. 2024 ప్రారంభంలో సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి జగనన్న కాలనీలలో నిర్మాణాలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


ఇళ్ల మధ్యలో మొలిచిన పిచ్చి మొక్కలు

ఇళ్ల నిర్మాణాల వివరాలు ఇలా..

లే అవుట్ పేరు	ఇళ్ల నిర్మాణల సంఖ్య	బేస్‌మట్టం	లెంటల్	శ్లాబ్ వేసినవి
బుర్రిపాలెం	3215	447	12	6
నేలపాడు	2135	709	6	5
గోలిడొంక	1732	408	4	21
పెదరావూరుచీ	1772	225	9	13
జగ్గడిగుంటపాలెం	1053	511	0	1

నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు

తెనాలి పరిధిలోని జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల్లో కొంత జాప్యం జరిగింది. ఇసుక రీచ్‌లను ప్రభుత్వం నిలిపివేయడం వల్ల ఇసుక కొరత ఉంది. కొద్ది రోజుల్లో రీచ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రాగానే లబ్ధిదారులకు ఇసుకను పంపిణీ చేస్తాం. ఇప్పటికే కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో మాట్లాడాం. పనుల వేగం పెంచాలని సూచించాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

–వై. భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గృహ నిర్మాణ శాఖ, తెనాలి

క్లుప్తంగా

మానసిక ఉల్లాసానికి ఆటలు దోహదం



తెనాలి టౌన్: విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆటలు దోహదపడతాయని సెయింట్ పాల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ డైరెక్టర్ చావాలి ఆకుల్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం మారీసుపేటలోని స్కూలులో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల మరో డైరెక్టర్ చావాలి తేజోనాథ్ మాట్లాడుతూ ఆటలతో విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో చోరీలు

కొల్లిపర: మండలంలోని రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వల్లభాపురానికి చెందిన కొండా సర్వేరెడ్డి మూడు రోజుల కిందట ఇంటి నుంచి సెంటర్‌లో ఉన్న దుకాణానికి వెళ్లారు. గంట తరువాత తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియ వ్యక్తి చొరబడి బీరువాలో ఉన్న రూ.లక్షను అపహరించాడు. దీంతో సర్వేరెడ్డి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. == కొల్లిపర శివారు గుడిబండివారిపాలెంలో ఆళ్ల భూషిరెడ్డి ఇంటిలో ఎవరు లేరన్న విషయాన్ని తెలుసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తాళాలు పగులగొట్టారు. బీరువాలో ఉన్న 40గ్రాముల బంగారం, రూ.50వేలను ఎత్తుకు పోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు వదిలిపెట్టి రెండు, మూడు రోజులు బయటకు వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. గ్రామంలో అనుమానంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వరుస దొంగతనాల నేపథ్యంలో మండలంలో పోలీస్ నిఘా పెంచనున్నట్లు తెలిపారు.

దాడిపై కేసు నమోదు

తెనాలిరూరల్: స్వల్ప విషయమై యువకుడిపై దాడి చేసి గాయపర్చడంపై కేసు నమోదైంది. పట్టణ పినపాడుకు చెందిన శ్రీరామ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఇంటికి వచ్చిన అతను ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలసి దుండిపాలెం డొంక రోడ్డులో మాట్లాడుతున్నాడు. అక్కడికి సమీపంలో కొందరు యువకులు మద్యం తాగుతుండగా వారి గురించే శ్రీరామ్ మాట్లాడుతున్నాడని ఘర్షణ పడి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్‌ఐ ప్రకాశరావు తెలిపారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి




తెనాలి రూరల్ : కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కొలకలూరు ఫ్లైఓవర్ కింద సుమారు 55 ఏళ్ల వ్యక్తి ఈ నెల 21వ తేదీ సాయంత్రం నిద్రపోతుండగా. అతనిపై కారు ఎక్కింది. తీవ్రంగా గాయపడిన అతన్ని గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: వేర్వేరు ఘటనల్లో జూదరులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆకస్మిక దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3,500 స్వాధీనం చేసుకున్నారు. సాలిపేటలో పేకాట శిబిరంపై వన్‌టౌన్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 42,400 స్వాధీనం చేసుకున్నారు. ఇదే ప్రాంతానికి సమీపంలో సింగల్ నంబరు లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నారు.

డీవీఆర్‌కు కృతజ్ఞతలు



మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడిగా నియమించబడిన తిరుమలశెట్టి సురేంద్ర కుమార్ సోమవారం ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. సురేంద్ర కుమార్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, దొంతిరెడ్డి వేమారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాడేకోరు రమేష్ బాబు, కట్టెపోగు సిసింద్రి, కోసూరి కోటేశ్వరరావు, దానబోయిన వెంకట్ పాల్గొన్నారు.

శ్రీశైల భక్త సేవా సమితి సేవలు అభినందనీయం

డీఎస్పీ పి.జనార్దనరావు


జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

తెనాలి టౌన్: శ్రీశైల భక్త సేవా సమితి సేవలు అభినందనీయమని డీఎస్పీ పి.జనార్దనరావు కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని దేవిప్రియ ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం శ్రీశైల భక్త సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానానికి ఏటా సమితి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే 78వేల మంది భక్తులకు సరిపడా ఉచిత ప్రసాదం, మంచినీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలను గత 17 సంవత్సరాలుగా సేవాసమితి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ధార్మిక కార్యక్రమంలో భాగస్వామిగా చేసినందుకు సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం సరుకులతో ఉన్న లారీలను సమితి సభ్యులు శ్రీశైలం పంపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.గోవర్ధన్, కె.బి.ఎన్. గుప్త, వి.రవీంద్ర, టీఎస్ఆర్. కృష్ణ, ఎం.పూర్ణ, కె.వి.సత్యనారాయణ, ఎస్.వేణు, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యతోనే మనిషి జీవితంలో మార్పు


పరీక్ష సామగ్రి అందజేస్తున్న నారాయణ

తెనాలి టౌన్: విద్యతోనే మనిషి జీవితంలో మార్పు సాధ్యమని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్ తెలియజేశారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గుమ్మడి వెంకట నారాయణ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ప్రతి మనిషి జీవితాన్ని ఉన్నత స్థితికి చేర్చుతుందని తెలిపారు. 10వ తరగతి విద్యార్థి భవిష్యత్‌కు మలుపుగా తెలిపారు. ఉన్నతంగా చదువుకుని జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా దాత ఈ సేవ కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె.సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా దివ్య కల్యాణ వేడుకలు ప్రారంభం


మయూర వాహనంపై స్వామి ఊరేగింపు

తెనాలి టౌన్: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లో మహా శివరాత్రి పురస్కరించుకుని పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మయూర వాహనంపై సోమవారం స్వామి ఊరేగింపు దేవస్థానం నుంచి ప్రారంభమైంది. పురవీధులల్లో అట్టహాసంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామిని దర్శించి టెంకాయలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రమణకుమారి మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 28వ తేదీ వరకు దేవస్థాన ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న శేషవాహనసేవ, నందివాహన సేవ, 26న లింగోద్భవ కాల అభిషేకాలు, ఎదురు కోలోత్సవం, దివ్య కల్యాణం, నంది వాహన సేవ, దివ్య రథోత్సవం, 28న వసంత మంటప సేవ, పుష్పయాగం జరుగుతాయని వివరించారు. శివరాత్రి రోజు భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని దేవాలయంలో క్యూలైన్లు, మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారుల మేధో వికాసానికి కృషి చేయాలి


మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో జయంతిబాబు

తెనాలి టౌన్: చిన్నారుల మేధో వికాసానికి అంగన్‌వాడీలు కృషి చేయాలని ఎంఈవో వి.జయంతి బాబు పిలుపునిచ్చారు. స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ హైస్కూలులో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఐదో రోజు సోమవారం కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లకు లెర్నింగ్ మెటీరియల్‌ను ఎంఈవో అందజేశారు. పిల్లల శారీరక, మానసిక మేధోభివృద్ధికి అవసరమైన పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో డాక్టర్ ఎం.సునీత, డీఆర్‌పీలు కె.సౌజన్య, రామరాజు, సీఆర్‌ఎంటీలు శ్రీదేవి, దీపాంజలి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ హుస్సేన్, సీహెచ్. రాము, రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ


కోర్టు వెలుపల నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

తెనాలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అడ్వొకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్– 2025 నిరసిస్తూ గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. తెనాలిలో కోర్టు ప్రాంగణం వెలుపల నినాదాలు చేశారు. యాక్ట్‌తో న్యాయవాద వృత్తికి ఉన్న స్వేచ్ఛను కాలరాయడమేనని ఆరోపించారు. ఇది అమల్లోకి వస్తే న్యాయవాదులు వృత్తిలో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న అకృత్యాలు, గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, దంతాల కిరణ్‌కుమార్, బొంత ఆంజనేయులు, అన్నం పిన్నారావ్, కొమ్ము అబ్రహం లింకన్, స్టాలిన్, రమేష్, డి. మల్లికార్జునరెడ్డి, మధిర సురేష్, కుమారస్వామి, కనపర్తి మధుకర్, ఆర్. రాఘవేంద్ర, ఎ. కిశోర్ కుమార్, కనపర్తి బెనహర్, శ్రీనివాస్ గౌడ్, రెహానా బేగం, లత, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి విద్యుత్ శాఖ ఏర్పాట్లు పూర్తి



తెనాలి టౌన్: మహా శివరాత్రి పండుగకు సంబంధించి విద్యుత్ శాఖ తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి తెలిపారు. వల్లమూడి క్వారీ తిరునాళ్ల, సంగంజాగర్లమూడి సంగమేశ్వర స్వామి దేవస్థానం, గోవాడ బాలకోటేశ్వర స్వామి దేవస్థానాల మార్గాల్లో ప్రభలకు ఆటంకం కలుగకుండా చెట్లను తొలగించి, విద్యుత్ తీగలను తప్పించినట్లు చెప్పారు. ఆయా దేవాలయాల వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ ప్రభల దగ్గర వేలాడే విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా లైన్లు తెగితే వాటిని తాకకుండా విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. విద్యుత్ శాఖ సమాచార కేంద్రం సేవలు 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. తెనాలి సబ్ కలెక్టర్, రేపల్లె ఆర్డీవో సమీక్షలు నిర్వహించి, విద్యుత్ శాఖకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సారా రహిత రాష్ట్రానికి కృషి చేద్దాం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ రాజశ్రీ


మార్కెట్ సెంటరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

రేపల్లె రూరల్: సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. నాటు సారా, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. పెదకూరగాయల మార్కెట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాటుసారా తాగి, ఇతర మాదక ద్రవ్యాలను తీసుకొని జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. నాటుసారాతో గ్రామీణ ప్రాంతాలలో అనేక మంది తమ కుటుంబాలను సైతం నాశనం చేసుకున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి బారినపడి యువత బంగారం లాంటి తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలతో ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రజల జీవితాలను చిదిమివేసే నాటుసారా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చట్టవ్యతిరేకమైన పదార్థాలు ఎవరైనా విక్రయించినా, తయారు చేసిన తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


చినకాకాని వాటర్ ట్యాంక్ వద్ద తాగునీటి సరఫరా పరిశీలిస్తున్న కమిషనర్

మంగళగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీంబాషా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని చినకకాని, నులకపేట ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త ఎప్పటికప్పుడు యార్డుకు తరలించాలని, ఇంటి ముందు చెత్త నిల్వలు ఉంచితే దాని వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్న క్యాంటీన్లు పరిశీలించి ఆహారం శుభ్రత, నాణ్యత, టోకన్ల పంపిణీలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తూతూమంత్రంగా బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం


సమావేశానికి హాజరైన అధికారులు

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఏటా వైభవంగా జరుగుతాయి. పొన్న వాహనం, కల్యాణ మహోత్సవం, దివ్య రథోత్సం రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఉత్సవాలకు రెండు నెలల ముందే అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఆధ్యాత్మికవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి, సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఈ ఏడాది ఉత్సవాలపై అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. సోమవారం బ్రహ్మోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. అన్ని శాఖల అధికారులు కూడా పాల్గొనక పోవడం విశేషం. జిల్లా నుంచి ఏ ఒక్క అధికారి రాలేదు. స్థానికంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ అంకమ్మరావు, మెడికల్ ఆఫీసర్ పి.అనూష, విద్యుత్ శాఖ ఏఈ, పోలీస్ శాఖ నుంచి ఎస్ఐ వెంకటేష్ హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం మరోసారి సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఏసీపీ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు.

జీపీఎస్‌తో వాహనాలకు భద్రత

- వాహనం ఎక్కడ ఉన్నా తెలుసుకునే అవకాశం
- ఎలాంటి భయం లేకుండా నిశ్చింతంగా ఉండొచ్చు..



మంగళగిరి: వాహనాలకు జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) పరికరాలు ఏర్పాటుతో భద్రంగా ఉంటాయి. వాహనాన్ని దొంగిలించినా వెంటనే తెలిసిపోతుంది. ఈ పరికరాన్ని వాహనాలకు ఏర్పాటు చేసే దొంగల బారి నుంచి వాహనాలను కాపాడుకోవచ్చు. వాహనానికి జీపీఎస్ ఉంటే ఎలాంటి భయం లేకుండా నిశ్చింతంగా వుండవచ్చు. ఉదాహరణకు పాత మంగళగిరికి చెందిన బిట్రా వెంకటేశ్వరరావు తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం ఉంచాడు. తెల్లవారేసరికి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తపేటకు చెందిన హరికృష్ణ కారును రోడ్డుపైన పార్కింగ్ చేయగా తెల్లవారేసరికి కనిపించలేదు. అయితే కారుకు జీపీఎస్ ఉండడంతో ఎక్కడుందో తెలుసుకున్న పోలీసులు వెంటనే స్వాధీనం చేసుకుని హరికి అప్పగించారు. ద్విచక్ర వాహనానికి జీపీఎస్ లేకపోవడంతో ఇప్పటివరకు ఆచూకీ లభించలేదు. పోలీసులు ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చుకోవడం మంచిదని చెబుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనాలు, ఆటోల చోరీలపై పోలీసులకు అధికంగా ఫిర్యాదులందుతున్నాయి. కార్లు, లారీలు, బస్సులు సైతం కేటుగాళ్లు అపహరించుకెళ్తున్న ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా దొంగలను పట్టుకోవడానికి రోజులు, నెలలు, సంవత్సరాలు పడుతోంది.



కొన్ని సందర్భాల్లో దొరక్కపోవడంతో ఆ వాహనాలను మరచిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పేద, దిగువ, మధ్య తరగతి ప్రజలకు ఈ రోజులలో ద్విచక్ర వాహనం కొనుగోలు ఆర్థికంగా భారం. కానీ, నేరగాళ్లు నిముషాల వ్యవధిలో వారి కష్టాన్ని అపహరించుకెళ్తున్నారు. దీంతో బాధితుల ఆవేదన వర్ణాతీతం.

జీపీఎస్‌తో అప్రమత్తం

దొంగతనాల కట్టడికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నాణ్యతను బట్టి రూ.వెయ్యి నుంచి అందుబాటులో ఉన్నాయి. వాటిని ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, బస్సులు, లారీలు ఇలా అన్నిటికీ అమర్చుకోవడం ద్వారా దొంగల బారి నుంచి కాపాడుకోవచ్చు. జీపీఎస్ అమర్చాక యాప్ ద్వారా సెల్ ఫోన్‌కి అనుసంధానం చేసుకోవచ్చు. వాహనం పార్కింగ్ చేసిన చోటు నుంచి దొంగలు అపహరించుకువెళ్తుంటే.. వెంటనే అలారం మోగడంతో పాటు సెల్‌ఫోన్‌కి మెసేజ్ వస్తుంది. దీంతో అప్రమత్తం కావచ్చు. ఒక వేళ వాహనం తస్కరించుకు వెళ్లినా.. ఎక్కడ ఉందనేది జీపీఎస్ ద్వారా తెలిసిపోతుంది.



వాహనాలకు భద్రత

జీపీఎస్ పరికరాన్ని వాహనాలకు అమర్చుకుంటే భద్రత ఉంటుంది. నేరస్తులు ఆ వాహనాలను చోరీ చేసి తీసుకెళ్లినా.. ఎక్కడైనా దాచిపెట్టినా.. పోలీసుల సాహకారంతో వాటిని గుర్తించి తీసుకురావచ్చు. ప్రతి వాహనానికి యజమానులు తప్పనిసరిగా జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోవాలి.

– మురళీకృష్ణ, డీఎస్పీ, నార్త్‌జోన్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా తదితరులు

మంగళగిరి టౌన్ : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరుగనున్న నేపథ్యంలో మంగళగిరి నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎంటీఎంసీ కమిషనర్ అలిమ్ బాషా సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, ర్యాంప్, టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలను, సీకే హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళగిరి అర్బన్ పరిధిలో 4,500 మంది, రూరల్ పరిధిలో 3,591 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.